సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 3 । నవంబర్ । 2022



'ఉపాధి' అక్రమాలపై విచారణ

చింతపల్లి మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం ప్రజా వేదిక నిర్వహించారు. 17 పంచాయతీలకు సంబంధించి రూ.40కోట్లతో వివిధ పనులు చేపట్టారు. 8లో



పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

- పందిరి మామిడి కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ లలితకామేశ్వరి 8లో

4,5 తేదీల్లో చింతపల్లిలో సదరం శిబిరం

కొయ్యూరు: దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు ఈనెల 4,5 తేదీల్లో చింతపల్లిలో సదరం శిబిరం నిర్వహించనున్నట్టు స్థానిక పోలీసులు బుధవారం తెలిపారు. చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వివరాలకు 9440904239, 9440904238 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

కూలిన భారీ వృక్షం

- తప్పిన పెను ప్రమాదం
- తెగిపడిన విద్యుత్ వైర్లు



అడ్డతీగలలోని నూతన తహసీల్దార్ భవనం వద్ద నేలకూలిన వృక్షం

అడ్డతీగల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ భవనం చెంతనే పూర్తిగా ఎండిపోయి ఉన్న భారీ వృక్షం బుధవారం ఉదయం కూలిపోయింది. దీంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దుశ్చర్తి నుంచి ప్రయాణికులను తీసుకుని వచ్చిన ఆటోకు కొద్ది దూరంలో చెట్టు పడడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వృక్షం పడిన చోట దుశ్చర్తి వైపు వెళ్లే ఆటోలు నిలిపి ఉంచుతారు. అదృష్టవశాత్తు ఆ సమయానికి ఆటోలను అక్కడ ఉంచలేదు. ఒకరోజు ముందుగా మంగళవారం చెట్టు కూలి పడి ఉంటే వారపుసంతకు వచ్చిన చాలామంది వ్యాపారులు, ప్రజలు గాయపడేవారు. తెగిపడిన విద్యుత్ వైర్లను ట్రాన్స్‌కో సిబ్బంది పునరుద్ధరించారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దే వైద్యం

ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్



దుంబ్రిగుడ పీహెచ్‌సీలో వైద్యసేవల గురించి తెలుసుకుంటున్న ఏడీఎంహెచ్ లీలాప్రసాద్

దుంబ్రిగుడ: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దే వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్ తెలిపారు. కించుమండ ఉపాధ్యాయ భవనం వద్ద గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. కించుమండ పంచాయతీ కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి గిరిజనుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుంబ్రిగుడ పీహెచ్‌సీని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మాతాశిశుమరణాల నివారణ, ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని, పిల్లలకు తప్పని సరిగా టీకాలు వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి సూర్యకళ,వైద్యాధికారి ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

మిరియాల యంత్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరురూరల్: కేంద్ర ప్రభుత్వ సంస్థ స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో విద్యుత్‌తో పనిచేసే మిరియాలు వలిచే యంత్రాలను 75 శాతం సబ్సిడీపై మంజూరు చేయనున్నట్టుస్పైసెస్ బోర్డు సీని యర్ ఫీల్డ్ ఆఫీసర్ బొడ్డు కళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మిరి యాలు సాగు చేస్తున్న గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టుపేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు భూమి పట్టా, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు జెరాక్స్ కాపీ లు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అందజేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఐటీడీఏ కార్యాలయం రెండో అంతస్తులో ఉన్న స్పైసెస్ బోర్డు కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులైన గిరిజనరైతులుసద్వినియోగం చేసుకోవాని పేర్కొన్నారు.

అరుదైన అందాలు.. పరిరక్షణే లక్ష్యంగా..

- గుడిసె పర్యాటకంపై కొనసాగుతున్న ఆంక్షలు
- గడ్డి భూముల సంరక్షణకు రంపచోడవరం డీఎఫ్‌వో కార్యాచరణ
- 10న అటవీశాఖ అమరవీరుల దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు



రంపచోడవరం: పర్యాటకులకు స్వర్గధామంలా ఉన్న మారేడుమిల్లి ఏజెన్సీలోని గుడిసె ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు అటవీశాఖ కార్యాచరణ రూపొందించింది. దీనిలో భాగంగా పర్యాటకంపై ఆంక్షలు విధించింది. అరుదైన గడ్డి మైదానాలు గుడిసె ప్రాంతాన్ని ప్లాస్టిక్ భూతం వెంటాడుతోంది. ఎత్తయిన కొండలపై ఉన్న గుడిసె వద్ద సూర్యోదయాన్ని తిలకించేందుకు పర్యాటకులు కొండల నడుమ ప్రయాణించి అక్కడికి చేరుకుంటారు. అయితే వారాంతాల్లో వందల సంఖ్యలో వచ్చే పర్యాటకులు తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ సంచులు, అవశేషాలను అక్కడ వదలేస్తున్నారు. ఇక్కడి సున్నితమైన గడ్డి మైదానాల్లో విచ్చలవిడిగా వాహనాల్లో తిరుగుతున్నారు. దీంతో వాటి ఉనికికి ప్రమాదం ఏర్పడింది.

ఉష్ణ సవన గడ్డి భూముల సంరక్షణపై దృష్టి

గుడిసె కొండల్లో ఉన్న ఉష్ణ సవన గడ్డి భూముల సంరక్షణపై అటవీశాఖ దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ఈనెల 10వ తేదీన గుడిసె ప్రాంతంలో అటవీశాఖ అమరవీరుల దినోత్సవం నిర్వహించేందుకు నిర్ణయించింది. దీనిలో భాగంగా రంపచోడవరం సబ్ డివిజన్ పరిధిలోని అటవీ అధికారులు, సిబ్బంది గుడిసెలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని రంపచోడవరం డీఎఫ్‌వో ఉత్తర్వులు జారీ చేశారు. గుడిసెకు వచ్చేటప్పుడు అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణకు వీలుగా సర్జికల్ గ్లౌజ్‌లు వెంట తెచ్చుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే సేకరించిన ప్లాస్టిక్ సీసాలను నింపేందుకు పెద్ద సంచులను కూడా తీసుకురావాలని తెలిపారు.

గుడిసె పర్యాటకానికి అనుమతి లేనట్టే

గుడిసె గ్రాస్ ల్యాండ్ హిల్స్‌ను పర్యాటకులు సందర్శించే అవకాశం ఇప్పట్లో లేనట్లే. రంపచోడవరం డీఎఫ్‌వో జీజీ నరేంధిరన్ గుడిసె ప్రాంతానికి పర్యాటకులకు అనుమతి లేదని సోమవారం ఉత్వర్వులు జారీ చేయడం తెలిసిందే. దాదాపు ఆరు నెలలు పాటు గుడిసె పర్యాటకం నిలిచిపోయింది. అక్టోబరు 28తో ముగిసిన ఉత్వర్వులతో తిరిగి గుడిసె గ్రాస్ ల్యాండ్‌కు పర్యాటకులను అనుమతిస్తారని అందరూ భావించారు. అయితే రంపచోడవరం డీఎఫ్‌వో గుడిసె ప్రాంతానికి ఎవర్ని అనుమతించమని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేవలం గుడిసె గ్రామానికి చెందిన వారు మాత్రమే గతంలో ఉన్న రహదారిలో వెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని అధిక సంఖ్యలో సందర్శిస్తున్న పర్యాటకులు ప్లాస్టికవస్తువులను వదిలిపెట్టడమే కాకుండా అక్కడే వంటలు చేయడం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అటవీశాఖ అధికారులు అధ్యయనంలో తేల్చారు. ఇలాంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని గుడిసె పర్యాటకంపై విధించిన ఆంక్షలను కొనసాగిస్తున్నారు.

ఆరు నెలల్లో భూముల రీ సర్వే పూర్తి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఏజెన్సీలో భూముల రీసర్వేను ఆరు నెలల్లో పూర్తి చేయాలని తహసీల్దార్లను ఐటీడీఏ పీవో సూరజ్ గనొరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో బుధవారం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏడు మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భూములు, గ్రామ సరిహద్దులను ముందుగా నిర్ధారించి రీ సర్వే చేయాలన్నారు. రీ సర్వేపై తహసీల్దార్లతో చర్చించారు. టెక్నికల్ టీమ్‌లు, క్లస్టర్ టీమ్‌లు, 60 మంది సర్వేయర్లు అవసరమని తహసీల్దార్లు తెలిపారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జీపీఎస్ మిషన్ ద్వారా రీ సర్వే జరుగుతోందని చెప్పారు. వీఆర్‌వోలు ఎంత మంది ఉన్నారు, ఎంత భూమి సర్వే చేస్తున్నారు తదితర వివరాలపై సమీక్షించారు. ప్రొఫార్మలో భూములు వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఇన్‌స్పెక్టర్లు దేవేంద్రుడు, రాజశేఖర్, తహసీల్దార్లు పి.ఎస్.వి. ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరో 50వేల డోసుల లంపీ స్కిన్ వ్యాక్సిన్ సరఫరా

పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ ప్రసాద్



జడ్డంగి వెటర్నరీ డిస్పెన్సరీని తనిఖీ చేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ప్రసాద్

రాజవొమ్మంగి: రంపచోడవరం, చింతూరు డివిజన్లకు మరో 50వేల డోసుల లంపీస్కిన్ వ్యాక్సిన్ సరఫరా అయినట్టు పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ డి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. మండలంలోని జడ్డంగి వెటర్నరీ డిస్పెన్సరీని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు పరిశీలించారు. డాక్టర్ తరుణ్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ లక్ష్మణ్‌లకు పలు సూచనలు చేశారు. లంపీ స్కిన్‌తో బాధపడుతున్న తెల్లజాతి పశువులకు సత్వరం చికిత్స అందజేయాలని తెలిపారు. గంగవరం మండలంలో కొన్ని పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి లక్షణాలు కనిపించినట్టు చెప్పారు. అనంతరం 'సాక్షి'తో మాట్లాడుతూ ఇప్పటికే ఈ రెండు డివిజన్లకు రెండు దఫాలుగా 15 వేలు, 24 వేల డోసుల లంపీ వ్యాక్సిన్ సరఫరా కాగా, తమ సిబ్బంది సమర్ధవంతంగా పంపిణీ చేశారన్నారు. ఈ రెండు డివిజన్లలో దాదాపు 80వేల తెల్లజాతి పశువులు ఉన్నాయన్నారు. ఈ డివిజన్లలో లంపీ స్కిన్ వ్యాధి బారిన పడిన పశువులు తక్కువ అని చెప్పారు. అయినా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా యుద్ధ ప్రాతిపదికన వ్యాక్సిన్ వేస్తున్నట్టు తెలిపారు. ఈ రెండు డివిజన్లలో పశువైద్యులు, సిబ్బంది కొరత ఉందన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినట్టు ఆయన చెప్పారు.

జోరుగా వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

జిల్లాలో 88.91శాతం పూర్తి



పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న లింగమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న ములియాపుట్టు గ్రామ వలంటరీ శాంతి

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము పంపిణీ కార్యక్రమం రెండవ రోజు బుధవారం జోరుగా సాగింది. వేకువజాము నుంచే జిల్లాలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు పింఛన్ సొమ్ము పంపిణీ చేపట్టారు. నవంబర్ నెలకు సంబంధించి 22 మండలాల్లో 1,20,723 మందికి ప్రభుత్వం రూ.30,81,37,000 విడుదల చేసింది. రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 1,07,332 మందికి రూ.27,37,41,000 పంపిణీ చేశారు. జిల్లా మొత్తం మీద 88.91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. హుకుంపేట మండలంలోని ములియాపుట్టు పంచాయతీ పరిధిలోని గ్రామ వలంటరీ వగ్గు శాంతి,పాడేరు జిల్లా ఆస్పత్రికి బుధవారం ఉదయాన్నే చేరుకుని ఇక్కడ వైద్యసేవలు పొందుతున్న కిల్లో లింగమ్మ అనే వృద్ధురాలికి పింఛన్ సొమ్మును పంపిణీ చేయడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. జిల్లా వ్యాప్తంగా మిగిలిన పింఛన్ దారులకు గురువారం సాయంత్రంలోగా పంపిణీని పూర్తి చేయనున్నారు.

అటవీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ

సాక్షి, పాడేరు: అటవీ అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణలో పాడేరు డివిజన్‌ను నంబర్–1గా నిలపాలని, ఆ దిశగా సిబ్బంది కృషి చేయాలని డీఎఫ్‌వో కె.వినోద్‌కుమార్ ఆదేశించారు. పాడేరు అటవీశాఖ డివిజన్ పరిధిలోని అటవీ రేంజ్ అధికారులు, ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన పాడేరు డివిజన్‌కు సంబంధించిన పరిధులు, అటవీ అభివృద్ధి కార్యక్రమాలపై డీఎఫ్‌వో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను విస్తృతం చేయాలని తెలిపారు. మారుమూల గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి,సెల్ టవర్ల నిర్మాణానికి అటవీశాఖ అధికారులు సహకరించాలన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే తనకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు తమ నిర్దేశిత అటవీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని డీఎఫ్‌వో ఆదేశించారు.ఈ సమావేశంలో పాడేరు,పెదబయలు,అరకులోయ,అనంతగిరి రేంజ్ అధికారులు కె.శ్రీనివాసరావు,బి.చంద్రశేఖరరావు,పి.శ్రీనివాసరావు,దుర్గాప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

అడవుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

చింతపల్లి: అడవుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదలవుతున్నట్టు చింతపల్లి డివిజన్ డీఎఫ్‌వో సూర్యనారాయణ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని రేంజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల అభివృద్ధితోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని చెప్పారు. మన్యంలో ఒకప్పుడు అడవులు అధికంగా ఉండేవని, కాలక్రమేణా తగ్గుముఖం పట్టాయన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కల పెంపకం చేపట్టడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



అటవీశాఖ అధికారులు,ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వినోద్‌కుమార్

'స్పందన' సమస్యలకు సత్వరమే పరిష్కారం

సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



సబ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న రామవరానికి చెందిన పోలవరం నిర్వాసితులు

చింతూరు: స్పందన కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్పందనలో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఎంతో ఆశతో అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి 33 దరఖాస్తులు స్వీకరించారు.

ముంపు జాబితాలో చేర్చాలని వినతి

తమను పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని వీఆర్‌పురం మండలం రామవరం గ్రామస్తులు సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 270 కుటుంబాలు ఉండగా బుధవారం వెలువడిన ఆర్‌అండ్‌ఆర్ నోటిఫికేషన్‌లో 102 కుటుంబాలకు చెందిన పేర్లు రాలేదని తెలిపారు. రామవరంలో 60, రామవరం పాడులో 42 కుటుంబాల పేర్లు రాకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ పేర్లను కూడా ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో చేర్చి తమకు న్యాయం చేయాలని వారు సబ్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బారావు, తహసీల్దార్ శ్రీధర్‌తో చర్చించారు. ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ముంపు జాబితా ఆధారంగా తాము ఆర్ అండ్‌ఆర్‌కు సంబంధించి పత్రికల్లో నోటిఫికేషన్ ఇస్తున్నామని, దీనిపై ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించే సమయంలో సంబంధిత కుటుంబాలు తమకు ఫిర్యాదులు అందచేసే అవకాశముందని వారు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామసభల సమయంలో నిర్వాసితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన మెనూ

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న పీవో గోపాలకృష్ణ

చింతపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశించారు. మండల కేంద్రంలో బుధవారం పర్యటించిన ఆయన స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలని ఆయన సూచించారు. ఈ నెల 4,5 తేదీల్లో నిర్వహించే సదరం శిబిరాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు అన్ని గ్రామాలకూ సమాచారం అందించాలని తెలిపారు. సదరం శిబిరంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అభిషేక్, తహసీల్దార్ ప్రసాద్, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్



ఉసిరిజోన్నలులో సబ్ కలెక్టర్ సమక్షంలో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న లబ్ధిదారు



ఇర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: గ్రామీణ గృహ నిర్మాణ సంస్థ ద్వారా మంజూరైన గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సూచించారు. మండలంలోని ఉసిరిజొన్నలు, ఇర్లపల్లి గ్రామాల్లో ఇళ్ల లబ్ధిదారులతో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉసిరిజొన్నలు గ్రామంలో ఓ లబ్ధిదారు సబ్ కలెక్టర్ సమక్షంలో కొబ్బరికాయ కొట్టి తన ఇంటి నిర్మాణం ప్రారంభించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ లబ్ధిదారునికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఇళ్లు మంజూరైన వారు ఆధార్ అనుసంధానంతో బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అనంతరం ముసురుమిల్లి ఆశ్రమ పాఠశాలను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇర్లపల్లిలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. వంటశాలలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని ఆదేశించారు.

థాయ్‌లాండ్‌కు చలో చలో

- ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ఫ్లైట్ ప్యాకేజీ
- విశాఖ నుంచి తక్కువ బడ్జెట్‌లో ప్రయాణం



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): మీరు ట్రావెలింగ్‌ను బాగా ఇష్టపడతారా.. తక్కువ ఖర్చుతో విదేశాలకు వెళ్లి ఎంజాయ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారా.. అయితే మీకో శుభవార్త. విశాఖ నుంచి థాయ్‌లాండ్ వెళ్లే పర్యాటక ప్రియుల కోసం ఐఆర్‌సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) ప్రత్యేక ఫ్లైట్ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. ఈ ఆఫర్‌లో భాగంగా అతి తక్కువ ధరలోనే విదేశీ టూర్ చేసేయొచ్చు. మరింకెందుకు ఆలస్యం నేడే మీ టికెట్ బుక్ చేసుకోండి. అలా థాయ్‌లాండ్ చుట్టేసి రండి. ఈ ప్యాకేజీ వివరాలను ఐఆర్‌సీటీసీ, సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా బుధవారం వెల్లడించారు. ఫాసినేటింగ్ థాయ్‌లాండ్ యాత్ర మొత్తం 5 రాత్రులు, 6 పగళ్లు ఉంటుంది. ఈ టూర్ డిసెంబరు 8వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభమై 13వ తేదీన విశాఖలోనే ముగుస్తుంది. ఈ టూర్‌లో పట్టాయలో గల నోంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, కోరల్ ఐలాండ్, సఫారి వరల్డ్ టూర్‌లతో పాటు బ్యాంకాక్‌లో గల గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ వంటి పర్యాటక ప్రదేశాలను దర్శించవచ్చు. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలైన నోంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, స్పీడ్‌బోట్‌లో కోరల్ ఐలాండ్‌లో విహరిస్తూ మధ్యాహ్నం భోజనం చేయడం నిజంగా మరుపురాని అనుభూతులను మిగుల్చుతుంది. వివరాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ, 0891–2500695, 82879 32318 నెంబర్లలో గానీ సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ తెలిపారు.

ప్యాకేజీ వివరాలు

ప్యాకేజీ పేరు: ఫాసినేటింగ్ థాయిలాండ్
ఎన్ని రోజుల టూర్: 5 రాత్రులు, 6 పగళ్లు
ప్రయాణం: ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం

ఎవరికి ఎంత ఫీజు (అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి)	
సింగిల్ ఆక్యుపెన్సీ	రూ. 63,310
డబుల్ ఆక్యుపెన్సీ ఒక్కొక్కరికి	రూ.54,999
ట్రిబుల్ ఆక్యుపెన్సీ ఒక్కొక్కరికి పిల్లలకు ప్రత్యేక రుసుము చెల్లించాలి.	రూ.54,999

టూర్‌లో ఎలాంటి సౌకర్యాలు

- ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం
- ఇండిగో ఎయిర్‌లైన్, ఎకానమి క్లాస్‌లో విమాన ప్రయాణం
- రాత్రివేళ 3 స్టార్ హోటల్స్‌లో బస
- టూర్ ప్రారంభం నుంచి ఎయిర్‌పోర్ట్ పికప్, డ్రాపింగ్, సైట్ సీయింగ్ అన్ని ఏసీ వాహనాలలోనే..
- అన్ని చోట్ల తిరిగేందుకు లోకల్ గైడ్ సౌకర్యం అందుబాటులో..
- టూర్ ప్యాకేజీలో ప్రయాణ బీమా సౌకర్యం కూడా పొందుతారు.

గ్రామాల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



హుకుంపేట మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేట, ఆమురు గ్రామాల్లో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బుధవారం పర్యటించారు. ఆమురు గ్రామంలో రూ.40లక్షలతో చేపట్టనున్న వంతెన నిర్మాణ పనులకు, కామయ్యపేటలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామల్లో ఎమ్మెల్యేకు గిరిజనులు పెద్ద ఎత్తున పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని చెప్పారు. -8లో

సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు అండగా ప్రభుత్వం



వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని ఎత్తుకుని యోగక్షేమాలు తెలుసుకుంటున్న మాధవి



మాధవిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడెంకొత్తవీధి/చింతపల్లి రూరల్: సికిల్‌సెల్ ఎనీమియా ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఉత్తరాంధ్రా మహిళా స్త్రీశిశు సంక్షేమ శాఖ చైర్ పర్సన్ మంతిని మాధవి తెలిపారు. జీకే వీధి, చింతపల్లి మండలాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. జీకే వీధి మండలం జడుమూరులో పర్యటించిన ఆమె సికిల్ సెల్‌తో బాధపడుతున్న చిన్నారి ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ అందజేయడానికి వీలుగా వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. చింతపల్లి మండల కేంద్రంలో పర్యటించిన ఆమె అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమెను ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూషా దేవి, జిల్లా సీడీపీవో సూర్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు రవి, సీడీపీవో రమ్య తదితరులు పాల్గొన్నారు.

విషాహారం తిన్న పశువులకు అస్వస్థత



అస్వస్థతకు గురైన పశువులు



రాజవొమ్మంగి: మండలంలోని అనంతగిరి గ్రామంలో బుధవారం పశువులు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. మేత మానేసి కుప్పకూలాయి. మేతకు వెళ్లిన పశువులు విషపూరితమైన ఆకులు తినిఉంటాయని భావిస్తున్నారు. ఇంటికి వచ్చిన ఆరు పశువులు కుప్పకూలి ఆహారం తినడం మానేశాయని దూళి ప్రసాద్, ఈశ్వర్రావు, ఆనందరావు తదితర రైతులు వాపోయారు.

విషాహారం వల్లే..

విషాహారం వల్లే పశువులు అస్వస్థతకు గురయ్యాయని వెటర్నరీ వైద్యులు తెలిపారు. విషయం తెలిసి తమ సిబ్బందితో పాటు వెళ్లి పరిస్థితిని సమీక్షించామని, పశువులకు చికిత్స అందజేస్తున్నామని తెలిపారు. పశువులు కోలుకొంటాయని, రైతులు ఆందోళన చెందాల్సి పని లేదన్నారు.

గ్రామాల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఆమురులో రూ.40లక్షలతో వంతెన నిర్మాణం
- వారధికి మర్రి కామయ్యగా నామకరణం
- అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ఆమురు గ్రామంలో వంతెన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, నాయకులు, అధికారులు



కామయ్యపేటలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాప చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

హుకుంపేట: గిరిజన గ్రామాల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేట, ఆమురు గ్రామల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామల్లో ఎమ్మెల్యేకు గిరిజనులు పెద్ద ఎత్తున పూలమాలలతో స్వాగతం పలికారు. ముందుగా కామయ్యపేటలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమురు గ్రామంలో ఎమ్మెల్యే పాల్గుణ పర్యటించారు. పీవీటీజీ నిధులు రూ.40లక్షల వ్యయంతో మంజూరైన వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతు తీగలవలస, మట్టుజోరు పంచాయతీల ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుని, గతంలో ఇచ్చిన మాట ప్రకారం వంతెనను మంజురు చేశామన్నారు. వంతెన నిర్మాణం వలన ఆమురుతో పాటు మట్టుజోరు పంచాయతీలకు చెందిన పలు గ్రామలకు మోక్షం లభిస్తోందని, రెండు నెలల వ్యవధిలోనే ఈ వంతెన పూర్తవుతుందని చెప్పారు. ఈ వంతెనకు స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి కామయ్య పేరు నామకరణం చేస్తున్నట్టు ప్రకటించారు. మండలంలోని విస్తృతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గుర్రలతోట గ్రామంలో రూ.1.40కోట్లు, కిన్నెర్లోవా గ్రామంలో రూ.1.80లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. హుకుంపేట-కామయ్యపేట ప్రధాన రహదారికి రూ.2.40కోట్లు మంజురైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ మూడేళ్లలో పంచాయతీకి రూ.35కోట్లతో సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణంలో గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ ద్విచక్ర వాహనంలో పాడేరు వరకు వెళ్లారు. ఎంపీపీ కూడా రాజుబాబు, వైస్ ఎంపీపీ ప్రియాంక, ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవో రామచంద్రరావు, సీడీపీవో బాలచంద్రమణి దేవి, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఏవో సరోజిని, హౌసింగ్ డీఈఈ మోహనరావు, గౌరీశంకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం. విశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు బేసు, సాంబ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగరాజు, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు చినసత్యం, నాయకులు బొంజుబాబు, చిన్నబ్బి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై విస్తృత అవగాహన

సాక్షి, పాడేరు: ఆర్‌బీఐ సూచనల మేరకు జిల్లాలో మండలాల వారీగా ఈనెల 30వతేదీ వరకు బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా లీడ్ మేనేజర్ రవితేజ బుధవారం ప్రకటనలో తెలిపారు.సమావేశాల్లో వినియోగదారులకు ఆర్థిక అక్షరాస్యత, హక్కులు, ఇంటర్నెట్ సమస్యలు పరిష్కారం,బ్యాంకు సమస్యల పరిష్కారం మెకానిజం, ఖాతాదారులకు దూరమైన సేవలు, శివారు ప్రాంతాల్లో బ్యాంకు సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ మేరకు పాడేరులో-5వ తేదీన, అరకులోయలో-10న, చింతపల్లిలో-17న, చింతూరులో-24న, రంపచోడవరంలో-25న సబ్ డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో హుకుంపేటలో-9న, జి.మాడుగులలో-11న, కొయ్యూరులో-15న, ముంచంగిపుట్టులో-16న, పెదబయలులో-18న, అనంతగిరిలో-19న, డుంబ్రిగుడలో-21న, జీకే వీధి, కూనవరంలో-22న, వై.రామవరం, ఎటపాకలో-23న, అడ్డతీగల, మారేడుమిల్లిలో-25న, దేవీపట్నం, రాజవొమ్మంగిలో-28న, గంగవరం, వి.ఆర్.పురంలో-29 ఆయా ప్రాంత ఎంపీడీవో కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఖాతాదారులు సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజ్‌మా సాగుపై సూచనలు



కోరాపల్లిలో రాజ్‌మా పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఎంపీఈవో ప్రశాంత్

జి.మాడుగుల: మండలంలో పలు పంచాయతీల్లో గిరిజన రైతులు పండిస్తున్న రాజ్‌మా పంటపై వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. గిరిజన రైతులకు సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఆయా పంటల పరిస్థితిని వారు గమనిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలో కోరాపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఎంపీఈవో ప్రశాంత్‌కుమార్ రైతులు పండించే పంట స్థితిగతులను పరిశీలించారు. రైతులు పండించే పంట పూతదశలో ఉందని, సకాలంలో వర్షాలు కురిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కోరాపల్లి సర్పంచ్ రాజులమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నానాజీ ఉన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ

కొయ్యూరు: ఇటీవల గుంటూరులో నిర్వహించిన డీఎఫ్‌వోల యూనియన్ ఎన్నికల్లో చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ జోనల్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా ఏపీ ఫారెస్ట్ జూనియర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.లక్ష్మణ్ బుధవారం చింతపల్లిలో డీఎఫ్‌వోను అభినందించారు. డీఎఫ్‌వో సూర్యనారాయణ మాట్లాడుతూ అటవీ సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వోను ఘనంగా సన్మానించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ చింతపల్లి డీఎఫ్‌వో జోనల్ కార్యదర్శిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన చింతపల్లి పరిధిలోని బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్‌కు సొంత నిధులతో యూనిఫామ్, టోపీలు అందజేసినట్టుగా చెప్పారు. కిందటి నెలలో అనకాపల్లిలో సిబ్బందికి వంద టోపీలు పంపిణీ చేశామన్నారు.

ఆస్పత్రిలో విద్యుత్ సమస్యకు చెక్



ఇన్‌పేషెంటు వార్డులో ఏర్పాటుచేసిన చార్జింగ్ ఎల్‌ఈడీ బల్బులు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో విద్యుత్ సరఫరాతో రోగులు ఇబ్బందులు పడకుండా సూపరింటెండెంట్ డాక్టర్ జి.గౌతమి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా చార్జింగ్ ఎల్‌ఈడీ లైట్లను బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటుచేశారు. ఆస్పత్రిలోని జనరేటర్ మొరాయించడంతో విద్యుత్ కోతల సమయంలో రోగులు ఇబ్బందులు పడేవారు. సమస్య పరిష్కారానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ గౌతమి చొరవతో ఇన్‌పేషెంట్ వార్డులో చార్జింగ్ లైట్లు అందుబాటులో తీసుకొచ్చారు. అన్ని విభాగాల్లో ఏర్పాటుచేస్తున్నామన్నారు.

170 కిలోల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు



నిందితుడు ,పట్టుబడిన గంజాయితో సీఐ రమేష్,సిబ్బంది

చింతపల్లిరూరల్: మండలంలోని అంజలి శనివారం పంచాయతీ గున్నమామిడి గ్రామంలో 170 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్టు సీఐ రమేష్ బుధవారం తెలిపారు. గున్నమామిడి గ్రామానికి చెందిన గెమ్మెలి కళ్యాణ్(50) తన ఇంటి వెనక తుప్పల్లో దాచిపెట్టిన 170 కిలోల గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నామన్నారు. జి.మాడుగుల మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇతనికి గంజాయి సరఫరా చేశారన్నారు. త్వరలో వారిని కూడా పట్టుకుంటామని ఎస్‌ఐ చెప్పారు. గంజాయి విలువ రూ.3.40 లక్షలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఎస్‌ఐ ఆలీ షరీఫ్, సిబ్బంది గిరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి



నాగరాజు(ఫైల్)

పాడేరు రూరల్: పాడేరు-చోడవరం ప్రధాన రహదారిలోని రాజాపురం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి మృతి చెందాడు. పాడేరు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని సాయి లాడ్జి పక్కన ఓ హోటల్, కిరాణ దుకాణం నిర్వహిస్తున్న ఆళ్ల నాగరాజు(45) అనే వ్యక్తి మంగళవారం భూ తగాదల నిమిత్తం మైదాన ప్రాంతానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్లినట్టు తెలిసింది. పనులు ముగించుకుని తన వాహనంపై పాడేరుకు వస్తుండగా ఘాట్‌రోడ్డులోని రాజాపురం మలుపు వద్ద ఓ గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొని, ఆయన తలపై నుంచి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలపాలైన నాగరాజు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రధాన రహదారిపై మృతదేహం ఉండడంతో కొంచెం సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

నిరుపయోగంగా సీసీ కెమెరా

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసి నిఘా నేత్రం(సీసీ కెమెరా) ఏడాదిగా పని చేయడం లేదు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో గంజాయి అక్రమ రవాణాను,బైకుల చోరీ,దుకాణాల్లో దొంగతనాలు వంటి ఆరికట్టేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏడాది కిందట ఏర్పాటు చేశారు. మూడు నెలలు మాత్రమే సీసీ కెమెరాలు పనిచేసి పాడైనట్టు స్థానికులు చెబుతున్నారు. గంజాయి అక్రమ రవాణా, దొంగతనాలు జరగకుండా అధికారులు స్పందించి కెమెరాను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ సీసీ కెమెరాల మర్మమ్మతుల కోసం టెక్నీషియన్‌కు సమాచారం అందించామని, త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

చింతపల్లి రూరల్: మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలోని 17 పంచాయతీలకు సంబంధించి 2020-21, 2021-2022 ఏడాదిలో రూ.40కోట్లతో వివిధ పనులు చేపట్టారు. ఆయా పనులకు సంబంధించి గత వారం రోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలను ప్రజావేదికలో వెల్లడించారు. పలు గ్రామాల్లో పనులు చేయకుండానే చేసినట్టు, కూలీలు హాజరైనట్టు తప్పుడు మస్తర్లతో పాటు పక్కదోవపట్టిన నిధులు వేల్లడైనట్లు బృందం సభ్యులు తెలిపారు. అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోంటామని ఏపీడీ రామారావు తెలిపారు. పలు పంచాయితీలకు చెందిన ప్రజలు ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై ఫిర్యాదులు చేశారని, దీనిపై విచారణ చేస్తామన్నారు. ఈసీ సంజీవరావు, ఏపీవో కొండబాబు, ఎంపీడీవో రమేష్ తదితరులున్నారు.

గ్యాస్ సరఫరాకు మార్గం సుగమం



జీసీసీ గ్యాస్ గొడౌన్ వద్ద సిలిండర్ల అన్‌లోడ్‌ను పర్యవేక్షిస్తున్న బ్రాంచ్ మేనేజర్ కొండన్న

జి.మాడుగుల: స్థానిక ఇండేన్ గ్యాస్ గోడౌన్ జీపీసీఎంఎస్(జీసీసీ) నుంచి గ్యాస్ సరఫరా చేస్తున్నట్టు జీపీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కొండన్న తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జీపీసీఎంఎస్(గిరిజన ప్రైమరీ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) ద్వారా పంపిణీ చేస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో పాడేరు నుంచి గ్యాస్ సరఫరా జరిగేదని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, జి.మాడుగుల గొడౌన్ నుంచి వినియోగదారులు పొందవచ్చన్నారు. జీపీసీఎంఎస్ పరిధిలో 176 కనెక్షన్లు ఉన్నాయని, వారంతా ఇకపై ఇక్కడి నుంచే వంట గ్యాస్ పొందవచ్చన్నారు. మండల పరిధిలో కొత్త కనెక్షన్ కావల్సిన వారు జీసీసీ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక డిపో నుంచిగ్యాస్ పొందాలనుకునే వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్‌ను పాడేరు నుంచి జి.మాడుగుల గ్యాస్ గొడౌన్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని ఆయన సూచించారు.

కాఫీ రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ

మండల పరిధిలోని కాఫీ రైతులకు రూ.33.7లక్షలకు గాను ఇప్పటివరకు రూ.23.15లక్షలు బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్టు జీపీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కొండన్న తెలిపారు. రైతులకు మిగతా బకాయి నగదు త్వరలో ఖాతాల్లో జమ చేస్తామన్నారు. దళారులకు కాఫీ అమ్మకాలు చేపట్టి మోసపోకుండా పూలింగ్ సిబ్బంది, కాఫీ సేకరణ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

ఎస్‌ఐ చొరవతో తాత్కాలిక రహదారి ఏర్పాటు



గిన్నెలకోట వద్ద వాగుపై రాళ్లుతో నిర్మించిన తాత్కాలిక రహదారి

పెదబయలు: మండలంలో గల అత్యంత మారుమూల గిన్నెలకోట పంచాయతీలో పలు గ్రామాల్లో బుధవారంఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ పర్యటించారు. ఆయా గ్రామాల గిరిజనులు గిన్నెలకోట వాగును దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎస్‌ఐకు విన్నవించారు. దీంతో ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తన సొంత ఖర్చులతో ట్రాక్టర్‌ను రప్పించి, స్థానికుల శ్రమదానంతో రాళ్లు, మట్టితో వాగుపై రాకపోకలకు వీలుగా తాత్కాలిక రహదారిని నిర్మించారు. రహదారి పొడవున ఉన్న గుంతలను పూడ్చించారు. తాత్కాలికంగా మార్గం సుగమమవడంతో స్థానికులు ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



కేవీకే శాస్త్రవేత్తలతో శిక్షణ పొందిన యువత

రంపచోడవరం: పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ లలితకామేశ్వరి అన్నారు. కెవీకెలో మూడు రోజులు పాటు జరిగిన పుట్టగొడుగుల పెంపకం శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కెవీకె, ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ మార్కెట్‌లో పుట్టగొడుగులకు గిరాకీ ఉందని, శిక్షణలో పొందిన అంశాలపై పెంపకం చేపట్టాలని సూచించారు. ఐదుగురు సభ్యులు బృందంగా ఏర్పాడి వీటి పెంపకం చేపట్టాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.చిరంజీవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం పుట్టగొడుగులు పెంపకానికి అనువైందన్నారు. తక్కువ ఖర్చుతో (రూ.30తో) ఇంటి వద్దే పుట్టగొడుగులు పెంపకాన్ని చేసుకోవచ్చన్నారు. మార్కెట్ కిలో పుట్టగొడుగులు రూ. 250 ఉందన్నారు. కెవీకెలోని పుట్టగొడుగుల పెంపకం యూనిట్‌లో జరుగుతున్న ముడిసరకు తయారీ, ప్యాకింగ్‌పై అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకున్న వారికి కేవీకే అన్ని విధాలుగా సహకారమందిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు. శిక్షణ పాల్గొన్న మహిళాలు పుట్టగొడుగులతో వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేశారు. కెవీకె శాస్త్రవేత్తలు వీరాంజనేయులు, ఆదర్శ తదితరులు పాల్గొన్నారు.